క్లుప్తంగా

మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నిక


ఎన్నికైన ఉద్యోగుల సంఘం సభ్యులు

శింగనమల: శింగనమల తాలుకా పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా మండల విద్యాశాఖాధికారి నరసింహరాజు వ్యవహరించారు. తాలుకా పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా బాబా ఫకృద్దీన్ (గార్లదిన్నె), ఉపాధ్యక్షుడిగా ఎస్.ఎం.సుబహాన్(నార్పల), ప్రధాన కార్యదర్శిగా ప్రతాప్ (శింగనమల), సంయుక్త కార్యదర్శిగా ఎం.క్రిష్ణయ్య (శింగనమల), ట్రెజరర్‌గా ఎం.నిర్మలదేవి(శింగనమల), జిల్లా కౌన్సిలర్‌గా డి.క్రిష్ణయ్య (బుక్కరాయ సముద్రం), నరేష్‌బాబు(గార్లదిన్నె) ఎన్నికయ్యారు.

హెల్మెట్, రికార్డులు లేకుంటే చర్యలు


రికార్డులు లేని ఆటో డ్రైవర్‌కు జరిమానా విధిస్తున్న ఎస్‌ఐలు సురేష్, గౌతం లు

గుత్తి: వాహనదారులు తప్పనిసరిగా రికార్డులు కలిగి ఉండాలి. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని లేకపోతే చర్యలు తప్పవని ఎస్‌ఐలు సురేష్, గౌతం హెచ్చరించారు. గుత్తిలోని పలు ప్రాంతాల్లో గురువారం రాత్రి, శుక్రవారం ఉదయం వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులతోపాటు రికార్డులు, లైసెన్స్, ఆర్‌సీ లేని వాహనదారులకు జరిమానా విధించారు. మొదటి సారి జరిమానాతో సరిపెడతామని రెండో సారి దొరికితే కేసులు నమోదు చేస్తామని వారు హెచ్చరించారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నాయకుడు షబ్బీర్‌కు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆర్థికసాయం అందజేశారు. ఈ నెల 6న అర్ధరాతి పచ్చమూకల దాడిలో పట్టణానికి చెందిన షబ్బీర్ ద్విచక్రవాహనం ధ్వంసమైన సంగతి తెలిసిందే. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆయనకు ఆర్థిక సాయం అందజేశారు. ఏపీ సీడ్ డెవలప్‌మెంట్ మాజీ డైరెక్టర్ కంచం రామ్మోహన్‌రెడ్డి, గంగాదేవిపల్లి సర్పంచ్ హనుమంతరెడ్డి చేతుల మీదుగా బాధితుడికి అందించారు.

16న కృష్ణాష్టమి వేడుకలు


పెద్దపప్పూరులో ఎస్‌ఐకి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

పెద్దపప్పూరు: మండలంలోని నరసాపురంలో ఈనెల 16, 17న ప్రభోదానంద ఆశ్రమం ఆధ్వర్యంలో క్రిష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం పెద్దపప్పూరు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్‌కు వారు ఆహ్వాన పత్రిక అందజేశారు. 17న గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రభోదానంద ఉత్సవ కమిటీ సభ్యులు బాలయ్య, హరినాథ్, సాంబశివుడు, చంద్రశేఖర్, సూర్యనారాయణ, ప్రసాద్, బాలరంగయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

వేడుకలను జయప్రదం చేయండి

పామిడి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో త్రైత సిద్ధాంతం ఆధ్వర్యంలో ప్రబోధ సేవాసమితి- ఇందూ జ్ఞాన వేదిక సంయుక్తంగా ఈనెల 16న మధ్యాహ్నం 1 గంటకు నిర్వహించనున్న కృష్ణాష్టమి వేడుకలను జయప్రదం చేయాలని ఆ సమితి సభ్యులు కోరారు. ఈ మేరకు వారు కృష్ణాష్టమి వేడుకల ప్రతులను పామిడిలో పంపిణీ చేశారు.

వైద్యం కోసం వచ్చి.. కుప్పకూలాడు..


గాయపడిన ఖాసీం

గుత్తి: వైద్యం కోసం వచ్చిన ఓ వృద్ధుడు ఉన్నఫళంగా కుప్పకూలి కిందపడి గాయపడిన ఘటన గుత్తి ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు.. జొన్నగిరికి చెందిన ఖాసీం అనే వృద్ధుడు కాలికి గాయం కావడంతో చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చాడు. అయితే ఆయన ఉన్నఫళంగా కుప్పకూలి కింద పడి గాయపడ్డాడు. నర్సులు గమనించి వెంటనే ఆయనకు వైద్యం చేశారు.

రోడ్లు ఇలా.. ప్రయాణమెలా?

- రహదారులన్నీ గుంతలమయం
- ఇబ్బందుల్లో వాహనదారులు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని పాతగుంతకల్లు మీదుగా వెళ్లే అంకోలా- నెల్లూరు జాతీయ రహదారి అధ్వానంగా మారింది. ఈ రోడ్డెక్కాలంటే వాహనదారులు భయపడుతున్నారు. నిత్యం వందలాది భారీ వాహనాల రాకపోకలు సాగించే ఈ రహదారి మధ్యలో ఏర్పడిన పెద్ద గుంతల కారణంగా ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. బీరప్పగుడి సర్కిల్‌లో రోడ్డు మధ్యలో సుమారు అడుగున్నర పెద్ద గుంత ఏర్పడింది. అలాగే ఊరువాకిలి ఎదురుగా రోడ్డు మధ్యన రోడ్డు కృంగిపోయి పెద్ద గుంత ఏర్పడింది. జగద్గురుమఠం ఎదురుగా, ఉరవకొండకు వెళ్తే రహదారి విశాల్ మార్ట్ ఎదురుగా కూడా రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. అసలే వర్షాకాలం.. ఆపై పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లేని కారణంగా ఈ గుంతల్లో వర్షపునీరు నిలుస్తోంది. వాహనదారులు ఆదమరిచి వేగంగా వస్తే ఇక అంతే సంగతులు. రోడ్డుపై సూచికలు, డేంజర్ లైట్ల ఏర్పాట్లల్లోనూ సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. గుంతలరహిత ఏపీగా తీర్చిదిద్దుతామని గొప్పలు చెప్పిన కూటమి ప్రభుత్వం అధ్వానంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేయించడంలో తాత్సారం చేస్తోంది. ఇప్పటికైనా రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చి ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ఎన్‌హెచ్, ఆర్‌అండ్‌బీ అధికారులపై ఉంది.


గుంతకల్లు పట్టణంలోని బీరప్పగుడి సర్కిల్‌లో రహదారి మధ్యలో తారు లేచిపోయిన దృశ్యం


ఊరువాకిలి ఎదుట రోడ్డు మధ్యలో ఏర్పడిన రంధ్రం


జగద్గురు మఠం సమీపంలో ఇలా..


ఉరవకొండకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుపై గుంతలు

కలెక్టర్ గారూ .. మీరైనా స్పందించండి..


గుంతలమయమైన చెరువు కట్ట రోడ్డు

బుక్కరాయసముద్రం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయినా రోడ్లను బాగుచేసేవారు కరువయ్యారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరాలు.. అనంతపురం నుంచి బీకేఎస్‌కు కలెక్టరేట్ మీదుగా వచ్చే రహదారి పూర్తిగా గుంతలమయమైంది. ఇదే రహదారిపై రోజూ ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నత అధికారులు వస్తూ పోతున్నారే తప్పా,, ఇంతవరకూ రోడ్డు నిర్మాణంపై ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. చిన్నపాటి వర్షాలకే గుంతలు నిండి వాహనదారులకు నరకయాతనగా మారుతోంది. కనీసం గుంతలు కూడా పూడ్చలేకపోవడం దారుణమని వాహనదారులు వాపోతున్నారు. ఇద్దరు కూటమి ఎమ్మెల్యేలకు సరిహద్దుగా ఉన్న రోడ్డు బాగోగుల నిర్లక్ష్యం చేయడంపై ప్రజలు మండిపడుతున్నారు. జిల్లా కలెక్టర్ అయినా స్పందించి చెరువు కట్ట రోడ్డు మరమ్మతు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం


గుంతకల్లులో వాసవీ అమ్మవారు


తాడిపత్రిలో వరలక్ష్మీదేవిగా పార్వతీదేవి


పెద్దవడుగూరులో సుంకులమ్మ


పామిడిలో కన్యకాపరమేశ్వరి మాత


బుక్కరాయసముద్రంలో ముసలమ్మ తల్లి


బుక్కరాయసముద్రంలో పెద్దమ్మ తల్లి

గుంతకల్లు: వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు ఘనంగా చేసుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామునే ఇళ్లలో అమ్మవారి విగ్రహాన్ని కొలువుదీర్చి వివిధ రకాల పుష్పాలతో అలంకరించి రుచికరమైన పదార్థాలు, పండ్లను నైవేద్యంగా సమర్పించారు. పూజ అనంతరం ముత్తైదువులకు నానబెట్టిన శెనగలు, పసుపు, కుంకుమ ఇచ్చారు. అలాగే పట్టణంలో కన్యకాపరమేశ్వరీ దేవీ ఆలయంలో శ్రావణ శుక్రవారం మూడో వారం సందర్భంగా విశేష పూజాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు స్వర్ణ చీరతో ముస్తాబు చేశారు. పలువురు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజాలు చేశారు. రాత్రి అమ్మవారును వెండి రథంపై కొలువుదీర్చి ప్రాకారోత్సవం నిర్వహించారు. సరస్వతీ విద్యామందిరం హైస్కూల్‌లో వర మహాలక్ష్మీ పూజా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి బండారు అశ్వత్థమ్మ, రిటైర్డు ఎంఈఓ కే.నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలో మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ నీలావతి నివాసంలో నిర్వహించిన వరలక్ష్మీ వ్రత పూజా కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైపర్సన్ నైరుతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: గుత్తి, గుత్తి ఆర్‌ఎస్‌లలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయాల్లో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. గుత్తిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఆర్యవైశ్య సంఘం, వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. ప్రధాన అర్చకులు వాసుదేవ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మాకం శ్రీకాంత్, కార్యదర్శి కిశోర్ బాబు, వాసవీ మహిళా మండలి అధ్యక్షురాలు యక్కల రాధాదేవి, కార్యదర్శి కృష్ణవేణి, కోశాధికారిణి గీతావాణి తదితరులు పాల్గొన్నారు.


గుత్తిలో వరలక్ష్మీ వ్రతపూజల్లో పాల్గొన్న వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, కౌన్సిలర్ నీలావతి

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తి,శ్రద్ధలతో చేసుకున్నారు. అనంతరం వాయినాలు సమర్పించారు.

తాడిపత్రిటౌన్: పట్టణంలోని బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయంలో పార్వతీదేవికి శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా వరలక్ష్మీదేవి అలంకరణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసారు.

పెద్దవడుగూరు: మండలంలోని క్రిష్టిపాడు, పెద్దవడుగూరు, చిత్రచేడు, చిన్నవడుగూరు తదితర గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని వరలక్ష్మీ వ్రతం, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దవడుగూరు లోని బాట సుంకులమ్మ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.


గుత్తిలో వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో, గృహాల్లోనూ శుక్రవారం వరలక్ష్మీ మాతా వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ఈసందర్భంగా అమ్మవారిని శోభాయానంగా అలంకరించారు.

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ముసలమ్మ కట్ట సమీపంలో ప్రముఖ పురాతన కాశీ విశ్వేశ్వర దేవాలయం, ముసలమ్మ తల్లి దేవాలయంలో శుక్రవారం భక్తులు వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయ ఆవరణలో దీపాలు పెట్టి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి


యాడికి మండలం కత్తిమానుపల్లిలో మాట్లాడుతున్న వెంకటరామిరెడ్డి, మండల కన్వీనర్ సంజీవరాయుడు


యల్లనూరు మండలం జంగంపల్లిలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న మండల కన్వీనరు శివ శంకర్

యాడికి: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండు చేశారు. తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదేశాల మేరకు కత్తిమానుపల్లిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వెంకటరామిరెడ్డి, మండల కన్వీనర్ సంజీవరాయుడు, తిరునాంపల్లి, రామన్న గుడిసెలు, రెడ్డి గుడిసెల గ్రామాల్లో సీనియర్ నాయకుడు బాలా రమేష్ బాబు , కేశవరాయుని పేటలో కొట్టే వెంకటరామిరెడ్డి శుక్రవారం బాబు ష్యూరిటీ -మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు, సూపర్ సిక్స్ పథకాలు అందాయా? లేదా? అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, శేఖర్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, లోకేశ్వరరెడ్డి, చంద్రారెడ్డి, సునీల్ రెడ్డి, సుధాకర్, శ్రీనాథ, రాముడు, పుల్లయ్య, కృష్ణారెడ్డి, నరేష్, చిన్న శ్రీరాములు, నారాయణ, వెంకటరామిరెడ్డి, దేవనాథరెడ్డి, రామిరెడ్డి, బాలన్న, వెంకటరాముడు, కంబగిరి రాముడు, జూటూరు భాస్కర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, వెంకటరంగారెడ్డి, ఎరికలప్ప, కొండారెడ్డి, చిదంబర రెడ్డి, ఆనంద్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాజారెడ్డి, కరుణాకర్, చౌడయ్య, రామాంజనేయులు, మొక్కల ఆంజనేయులు, కొట్టే వెంకట రామిరెడ్డి, వాసుదేవ రెడ్డి, రామచంద్రారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సూర్యచంద్రారెడ్డి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసకారి

యల్లనూరు: టీడీపీ అధినేత, ప్రస్తుత సీఎం చంద్రబాబు నాయుడు ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు శివశంకర్ అన్నారు. యల్లనూరు మండలంలో మొదటి రోజు వెంకటాద్రిపల్లి, కృష్ణాపురం, జంగంపల్లి, పాతపల్లి గ్రామాల్లో శుక్రవారం చంద్రబాబు రీ కాలింగ్ మేనిఫెస్టో కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను వివరించారు. ఎన్నికల హామీలను నెరవేర్చలేని సీఎంగా మిగిలిపోయారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు విష్ణునారాయణ, తిరుమలాపురం కృష్ణారెడ్డి, పాతపల్లి ప్రభాకర్‌రెడ్డి, తిరుపాల్‌రెడ్డి, జంగంపల్లి సంజన్న, కొండాపురం మల్లిఖార్జుననాయుడు, రామ్మోహన్, మద్దిలేటిరెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాగుల చవితి పూజలు


యర్రగుంట్లలో నాగుల కట్ట

గార్లదిన్నె: పవిత్ర శ్రావణ మాసంలో నాగుల చవితిని పురస్కరించుకుని ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. శుక్రవారం మహిళలు సమీపంలో ఉన్న నాగుల కట్ట, పుట్ట వద్దకు వెవెళ్లి ప్రత్యేక పూజలు చేసి, పుట్టలో పాలు పోసి, నాగుల చవితిని ఘనంగా చేసుకున్నారు. అలాగే మండలంలోని కోటంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద పుట్టకు, సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మహిళలు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

హోంగార్డు మృతికి సంతాపం


నివాళులర్పిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్: హోంగార్డు మృతికి పోలీసులు శుక్రవారం సంతాపం తెలిపారు. వివరాలు.. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ నాగరాజు గురువారం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో క్యాన్సర్ కారణంగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ జగదీష్ అంత్యక్రియల కోసం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. గాంధీనగర్‌లోని ఇంట్లో ఉంచిన మృతదేహానికి ఆర్‌ఎస్‌ఐ జాఫర్, ఏఆర్ ఎస్‌ఐ నాగేశ్వరావు, పీఎల్‌సీ నారాయణస్వామి, టౌన్ సీఐ సాయి ప్రసాద్, ఎస్‌ఐ గౌస్‌బాషా , సిబ్బంది నివాళులర్పించారు. ధైర్యంగా వుండాలని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

యాడికి: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని నంబర్ 3 సచివాలయం పరిధిలోని కాలనీలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించి ప్రజలు దోమల బారిన పడకుండా ఉండేందుకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇళ్లలో నీటి నిల్వలను బయట పారబోయించారు. స్థానికంగా యాంటీ లార్వా ఆపరేషన్లు చేయాలని, దోమకాటుతో ఎదురయ్యే ఇబ్బందులను స్థానికులకు వివరించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం తోతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రాత్రిపూట తప్పనిసరిగా దోమతెరలు వాడాలన్నారు. అనంతరం డ్రైనేజీల్లో పూడికలు తీయడం, ఎమెల్ ఆయిల్ స్ప్రేచేయడం, కల్వర్టుల వద్ద ఫాగింగ్ చేయడం వంటి యాంటీ లార్వా ఆపరేషన్లు నిర్వహించి దోమల నియంత్రణకు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో యాడికి వైద్యాధికారులు పరమేశ్వర, సుమంత్ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


ట్యాంకులోని నీటిని తొలగించి శుభ్రం చేస్తున్న దృశ్యం

మహిళకు పాముకాటు

గుత్తి రూరల్: మండలంలోని యంగన్నపల్లి గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళా కూలికి శుక్రవారం పాముకాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. పొలంలో కలుపుతీస్తుండగా పాటు కాటు వేసింది. కుటుంబసభ్యులు ఆమెను వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చికిత్స అందించి 24 గంటల పాటు అబ్జర్వేషన్‌లో ఉండాలని సూచించారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

తాడిపత్రిటౌన్: మండలంలోని తేరన్నపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 32 కేవీ, 220 కేవీ ల మరమ్మతుల కారణంగా తాడిపత్రి పట్టణ, రూరల్ మండలం, యాడికి మండలవ్యాప్తంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏడీలు ప్రభాకర్‌రావు, వసంతయ్య తెలిపారు. తాడిపత్రి, యాడికి మండల ప్రజలు సహకరించాలన్నారు

రాఖీలు కట్టిన బ్రహ్మకుమారీలు

బుక్కరాయసముద్రం: రాఖీ పండుగ సందర్భంగా బ్రహ్మకుమారీలు శుక్రవారం మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులకు రాఖీలు కట్టారు. బీకేఎస్‌లోని జిల్లా జైలు, ఓపెన్ ఎయిర్ జైలు, తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయాల్లో సిబ్బందికి రాఖీలు కట్టి పండుగ విశిష్టతను వివరించారు.


జిల్లా జైల్లో రాఖీ కడుతున్న బ్రహ్మ కుమారీలు

● పొంచి ఉన్న ప్రమాదం

పెద్దపప్పూరు: మండలంలోని చాగల్లు గ్రామ సమీపంలో ఉన్న రిజర్వాయర్ కాలువ సమీపంలో 11 కేవీ విద్యుత్ తీగలు కిందకి సాగి మామిడి చెట్లపై వేలాతుండడంతో అప్పుడప్పుడు నిప్పురవ్వలు పడుతున్నాయని తోట యజమాని విశ్రాంత ఎస్‌ఐ హనుమంతురెడ్డి వాపోయారు. వర్షం పడే సమయంలో ఎక్కడ విద్యుత్ షాక్‌కు గురికావాల్సి వస్తుందోనని బిక్కుబిక్కుమంటూ పొలంలోకి వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ట్రాన్స్‌కో ఏఈ నరసింహులుకు 'సాక్షి' సమస్యను వివరించగా .. సిబ్బందిని పంపి రెండురోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని సమాధానమిచ్చారు.


మామిడితోటలో వేలాడుతన్న విద్యుత్ తీగలు

● కూలడానికి సిద్ధం

గుత్తి: పట్టణంలోని ఓల్డ్ సీపీఐ కాలనీలో సుంకులమ్మ దేవాలయం సమీపంలో ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కూలడానికి సిద్ధంగా ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ వంగి పోయి, డ్రైనేజీ కాలువలోకి పడి పోయే అవకాశముంది. ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉందని వెంటనే సరిచేయాలని కాలనీవాసులు పలుసార్లు విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించారు. అయినా అధికారులు పట్టించుకోలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కూలడానికి సిద్ధంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను సరి చేయాలని కాలనీ వాసులు కోరారు.


ఓల్డ్ సీపీఐ కాలనీలో కూలడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్